ప్రజాశక్తి
శనివారం 30 మార్చి 2024 5 అనంతపురం

నేడు 'మేమంతా సిద్ధం'

◆ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన

◆గుత్తి, పామిడి, గార్లదిన్నె, రాప్తాడులో బస్సుయాత్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' కార్యక్రమం శుక్రవారం అనంతపురం జిల్లాలో జరుగనుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్రను చేపట్టిన విషయం తెలిసిందే. శనివారానికి ఈ యాత్ర అనంతపురం జిల్లాలోకి ప్రవేశించనుంది. మధ్యాహ్నం భోజన విరామం వరకు కర్నూలు జిల్లాలో ఈ యాత్ర ఉంటుంది. సాయంత్రం నాలుగు గంటలకు బసినేపల్లి వద్ద అనంతపురం జిల్లాలో ఈ యాత్ర ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి గుత్తి, పామిడి, గార్లదిన్నె , రాప్తాడు మీదుగ సాయంత్రం 7.30 గంటలకు ఇటుకలపల్లి వద్దకు చేరుకుంటారు. అనంతరం రాత్రికి కృష్ణంరెడ్డిపల్లిలో బస చేస్తారు.

అసంతృప్తులపై దృష్టి సారించేరా ?

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో పార్టీలో అసంతృప్తులు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టి సారిస్తారా అని పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి. టిక్కెట్లు ప్రకటించినప్పటి నుంచి ఇవి కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని చల్లార్చేందుకు కొంత ప్రయత్నాలు జరిగినా పెద్దగా ఫలితం కనిపంచలేదు. అత్యధిక నియోజకవర్గాల్లో ఇవి ఉన్నాయి. గుంతకల్లులో ఎడిసిసి మాజీ ఛైర్మన్ వీరాంజినేయులు, వై.వెంకటరామిరెడ్డిల మధ్య విభేదాలున్నాయి. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు బాహాటంగానే ఇవి వెల్లడయ్యాయి. ఇప్పటికీ ఇవి కొనసాగుతూనే ఉన్నాయి. శింగనల నియోజకవర్గంకు సంబంధించి వీరాంజినేయులుకు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని అత్యధిక మంది నాయకులు ఉన్నారు. వీరు కూడా బాహాటంగానే తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. వీరాంజినేయులుపై కంటే ప్రభుత్వ సలహదారులుగానున్న సాంబశివారెడ్డిపై ఉన్న వ్యతిరేకతే అధికంగా ఉంది. ఆయన వద్ద పనిచేసే ఉద్యోగే వీరాంజినేయులు కాబట్టి ఆయనకు సహకరించబోమని చెబుతున్నారు. రాప్తాడులోనూ కొంత మంది మీడియా సమావేశం ఏర్పాటు చేసి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి వ్యతిరేకంగా గళం వినిపించారు. అనంతపురం అర్బన్‌లో ముఖ్య నేతలంతా అసంతృప్తితోనున్నారు. ఈ విషయాన్ని అధిష్టానానికి తెలియజేశారు. అనంత అభ్యర్థికి వారంతా సహకరించే పరిస్థితి కన్పించడం లేదు. కదిరిలోనూ మక్బుల్‌కు సొంత క్యాడర్ నుంచే వ్యతిరేకత ఉంది. ఉరవకొండ నియజకవర్గంలో విశ్వేశ్వరరెడ్డి, శివరామిరెడ్డిల మధ్య విభేదాలు తారా స్థాయిలోనే ఉన్నాయి. హిందూపురం అసంబ్లీ నియజకవర్గంలోనూ ఇదే పరిస్తితి కొనసాగుతోంది. ఇలా అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థులకు సొంత పార్టీ నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వీటిపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ యాత్ర సందర్భంగా దృష్టి సారించి సరిచేసే చర్యలు చేపడతారా అని ఆ పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి. యాత్ర సందర్భంగా ఇక్కడే రాత్రి బస కూడా ఉండటంతో ఆ సమయంలో అసంతృప్త నేతలతో చర్చించి బుజ్జగించే ప్రయత్నం చేస్తారా.. లేదా.. అన్నది చూడాల్సి ఉంది.

టిడిపి టికెట్ల వ్యవహారం అనంతపురం జిల్లాలో తీవ్ర చిచ్చును రాజేసింది. అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. అనంతపురం అర్బన్ సీటు ప్రభాకర్ చౌదరికి కేటాయించకుండా దగ్గుపాటి వెంకటప్రసాద్‌కు కేటాయించారు. దీనిపై ప్రభాకర్‌చౌదరి వర్గీయులు మండిపడ్డారు. ఇదే విధంగా గుంతకల్లు టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ వర్గీయులు నిరసన చేపట్టారు. వైసిపి నుంచి ఇటీవలే పార్టీలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు గుంతకల్లు టిక్కెట్టు ఇవ్వడాన్ని స్థానిక మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ వర్గీయులు తప్పుబట్టారు.

టిడిపి అర్బన్ కార్యాలయం వద్ద ఫర్నీచర్, కరపత్రాలను దహనం చేస్తున్న ప్రభాకర్‌చౌదరి మద్దతుదారులు

◆ ఆఖరి జాబితాపై పెల్లుబికిన ఆగ్రహజ్వాల

◆ అనంత, గుంతకల్లులో తమ్ముళ్ల నిరసన

◆ కార్యాలయాల్లో ఫర్నిచర్ దహనం

◆ నేడు ఇన్‌ఛార్జులు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించే అవకాశం...

టిడిపిలో

టికెట్ మంటలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
అనంతపురం కలెక్టరేట్, గుంతకల్లు

టిడిపి చివరి జాబితాలో అనంతపురం, గుంతకల్లు అసెంబ్లీ స్థానాల్లో కొత్త వారికి అవకాశం కల్పించింది. దీంతో ఇప్పటి వరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యేల వర్గీయుల నుంచి తీవ్ర స్థాయిలో అసంతృప్తి జ్వాలాలు ఎగిసిపడ్డాయి. అనంతపురం అర్బన్ స్థానం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి కాదని దగ్గుపాటి వెంకట ప్రసాద్‌కు కేటాయించారు. ఈయన గతంలో రాప్తాడు ఎంపిపిగా పనిచేశారు. ఆయనకు అనూహ్యంగా టిక్కెట్టును కేటాయించడం ఆ పార్టీలోనే కాకుండా అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉన్నఫలంగా కొత్త ముఖాన్ని టిడిపి తెరపైకి తెచ్చినట్లు అయ్యింది. దీంతో ప్రభాకర్ చౌదరి వర్గీయులు తమ నాయకుడికి కాదని ఇతరులకు టిక్కెట్ కేటాయించారంటూ మండిపడ్డారు. అనంతపురం జిల్లా పార్టీ కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఇక గుంతకల్లులోనూ మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్‌ను కాదని గుమ్మనూరు జయరాంకు టిక్కెట్టు కేటాయించడం పట్ల అసంతృప్తులు పెల్లుబికాయి. గుంతకల్లు టిడిపి కార్యాలయంలో ఫర్నీచర్, టిడిపి కరపత్రాలను దహనం చేశారు.

ప్రభాకర్‌చౌదరికి మద్దతుగా ఆందోళన చేస్తున్న టిడిపి కార్యకర్తలు, నాయకులు

అనంతలో ఆత్మహత్యాయత్నం... రాజీనామాలు..

ప్రభాకర్ చౌదరి మద్దతుదారులు టిడిపికి రాజీనామా చేశారు. నగర పార్టీ అధ్యక్షులతో సహా పార్టీ క్యాడర్ మొత్తం రాజీనామాలు చేశారు. 395 మంది తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో నగర పార్టీ అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్‌తో పాటు, 12 మంది క్లస్టర్ ఇన్‌ఛార్జులు, 277 బూత్ ఇన్‌ఛార్జులు, 50 మంది డివిజన్ అధ్యక్షులు, 56 మంది యూనిట్ ఇన్‌ఛార్జులు రాజీనామా చేసి పార్టీ అధ్యక్షుడికి రాజీనామా లేఖలు పంపారు. పలువురు కార్యకర్తలు ఆత్మహత్యకు యత్నించారు. ఇద్దరు కార్యకర్తలు మహిళా కార్యకర్తలు విషయం తాగి ఆత్మహత్యకు యత్నించగా వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

గుంతకల్లులో భగ్గుమన్న తమ్ముళ్లు

గుంతకల్లు టిడిపి టికెట్టు కేటాయింపుపై తమ్ముళ్లు భగ్గుమన్నారు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు టిడిపి అధిష్టానం కేటాయించడంపై మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతకల్లులోని టిడిపి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యాలయంలోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కరపత్రాలు, కుర్చీలు రోడ్డుపై వేసి దహనం చేశారు. చంద్రబాబు నాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ మంటల్లో వేసి దహనం చేశారు. పార్టీ కోసం, కార్యకర్తల కోసం అహర్నిశలు శ్రమించిన జితేంద్ర గౌడ్‌కు టికెట్టు ఇవ్వకుండా నారా లోకేష్‌ను బండ బూతులు తిట్టిన గుమ్మనూరు జయరామ్‌కు టికెట్ ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం ఆదేశించినా ఎన్నికల్లో గుమ్మనూరు జయరాంకు సహకరించేది లేదని, అవసరమైతే జితేంద్ర గౌడ్‌ను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దించుతామని సీనియర్ నాయకులు తెలియజేశారు.

గుంతకల్లులో టిడిపి కార్యాలయంలో ఫర్నీచర్ దహనం చేస్తున్న జితేంద్రగౌడ్ మద్దతుదారులు

1వ తేదీనే వేతనాలు, పెన్షన్ల చెల్లింపునకు చట్టం చేయాలి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు, పెన్షన్ ఇచ్చేలా చట్టబద్ధత చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్స్ ఐక్యవేదిక కో ఛైర్మన్ కరణం హరికృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం (పోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) ఫోర్టో అనంతపురం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కరణం హరికృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్టో జిల్లా సెక్రటరీ జనరల్ వెంకటనారాయణరెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, డిటిడబ్ల్యూటిఎ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న, పిడుగు శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యూటిఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, శోభామని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రామావత్ నారాయణ నాయక్, ఎపిఎస్ ఏపిఏ రీజినల్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు

టిడిపి జట్టు రెడీ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి టిడిపి తుది జట్టు సిద్ధం అయ్యింది. ఇప్పటి వరకు 11 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమిలో భాగంగా ధర్మవరం నియోజకవర్గాన్ని బిజెపికి ఇచ్చారు. టిడిపి మిగిలిన రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానాల అభ్యర్థులను శుక్రవారం ప్రకటించింది. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్‌కు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుంతకల్లుకు మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్లను ప్రకటించారు. ఇక అనంతపురం పార్లమెంట్ స్థానాన్ని హిందూపురం నాయకులు అంబికా లక్ష్మినారాయణకు ఇచ్చారు. బాలకృష్ణ పట్టుబట్టి అంబికాకు ఇక్కడ టిక్కెట్టు ఇప్పించ్చినట్టు తెలుస్తోంది. కదిరి అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్టును కందికుంట వెంకటప్రసాద్‌కే కేటాయిస్తూ మార్పు చేసింది. మొదట ఆయన భార్య యశోదాదేవికి కేటాయించారు. కందికుంట వెంకటప్రసాద్‌పై తెలంగాణలో ఉన్న కేసులను కొట్టివేయడంతో ఆయనకే టికెట్‌ను కేటాయించారు.

టిడిపి ఫైనల్ టీమ్ ఇదే

సార్వత్రిక ఎన్నికలకు టిడిపి ఫైనల్ టీమ్ సిద్ధమైంది. శుక్రవారం ప్రకటించిన జాబితాతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులు పూర్తి స్థాయిలో ఖరారైపోయారు. అనంతపురం అర్బన్ దగ్గుపాటి వెంకట ప్రసాద్, రాప్తాడుకు పరిటాల సునీత, కళ్యాణదుర్గం అమిలినేని సురేంద్రబాబు, రాయదుర్గం కాలవ శ్రీనివాసులు, గుంతకల్లుకు గుమ్మనూరు జయరాం, శింగనమల బండారు శ్రావణి, తాడిపత్రికి జెసి.అస్మిత్‌రెడ్డి, ఉరవకొండకు పయ్యావుల కేశవ్, పుట్టపర్తి పల్లె సింధూర, కదిరి కందికుంట వెంకట ప్రసాద్, పెనుకొండ సవిత, హిందూపురం బాలకృష్ణ, మడకశిర డాక్టర్ సునీల్‌కుమార్, అనంతపురం పార్లమెంటుకు అంబికా లక్ష్మినారాయణ, హిందూపురం పార్లమెంట్‌కు బికె.పార్థసారధిలను ప్రకటించారు.

పార్లమెంట్ అభ్యర్థులు

అంబికా లక్ష్మినారాయణ (అనంతపురం)

బికె.పార్థసారధి (హిందూపురం)

◆ పూర్తి అభ్యర్థుల జాబితా ప్రకటన

◆ అనంతకు దగ్గుపాటి ప్రసాద్

◆ గుంతకల్లుకు గుమ్మనూరు

◆ అనంత పార్లమెంట్‌కు అంబికా లక్ష్మినారాయణ

◆ కదిరి టికెట్ కందికుంట వెంకటప్రసాద్‌కు...

అసంతృప్తులను అధిగమించేరా..?

అభ్యర్థుల ఎంపికలో సమస్యాత్మకంగా ఉన్న అనంతపురం, గుంతకల్లు నియోజకవర్గాలకు అభ్యర్థులను టిడిపి ఎట్టకేలకు ప్రకటించింది. ప్రకటించిన వెంటనే ముందుగా ఊహించినట్టుగానే నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. వీటిని ఏ రకంగా సమన్వయం చేయనున్నారన్నది చూడాల్సి ఉంది. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు మాత్రం భవిష్యత్ కార్చచరణకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అనుయాయులతో చర్చించి నిర్ణయం చేసే అవకాశాలూ ఉన్నట్టు తెలుస్తోంది.

అనంతపురం జిల్లా టిడిపి అభ్యర్థులు

దగ్గుపాటి ప్రసాద్ (అనంతపురం అర్బన్)

గుమ్మనూరు జయరాం (గుంతకల్లు)

అమిలినేని సురేంద్రబాబు (కళ్యాణదుర్గం

కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం)

పరిటాల సునీత (రాప్తాడు)



జెసి.అస్మిత్‌రెడ్డి (తాడిపత్రి)

పయ్యావుల కేశవ్ (ఉరవకొండ)

బండారు శ్రావణిశ్రీ (శింగనమల)

శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అభ్యర్థులు

కందికుంట వెంకటప్రసాద్ (కదిరి)

బాలకృష్ణ (హిందూపురం)

సవితమ్మ (పెనుకొండ)

డా॥సునీల్‌కుమార్ (మడకశిర)

పల్లె సింధూర (పుట్టపర్తి)

సత్యకుమార్ (ధర్మవరం, బిజెపి)

రేషన్ డీలర్, ఎండియు ఆపరేటర్ తొలగింపు

ముగ్గురు వాలంటీర్లపై ఎఫ్ఐఆర్ నమోదు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు ఒక రేషన్ డీలర్, ఒక ఎండియు ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. శుక్రవారం ప్రకటన జారీ చేశారు. రాజకీయ పార్టీలు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్ గ్రామం ఎండియు ఆపరేటర్ టి.రుద్రయ్య, శింగనమల నియోజకవర్గంలో ఎ.నారాయణపురం గ్రామం రేషన్ డీలర్ జి.అంజనదేవిని తొలగించినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి బొమ్మనహాల్ మండలం, హరేసముద్రం వాలంటీర్ వై.రాముడు, గోవిందవాడ గ్రామం వాలంటీర్ ఆర్.సుధాకర్, తాడిపత్రి మున్సిపాలిటీ వార్డ్ వాలంటీర్ బి.దాదాపీర్, శింగనమల వెస్ట్ నరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్ విడపనకల్ గ్రామ ఎండియు ఆపరేటర్ టి.రుద్రయ్య, ఉరవకొండ పటటనం వైఎస్‌ఆర్‌సిపి నాయకులు బోయ శ్రీనివాసులపై ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

జాగ్రత్తగా పింఛన్ల పంపిణీ చేపట్టాలి

ఎక్కడా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘన జరగరాదు..

పిడిఎస్ బియ్యం పంపిణీలోనూ అంతే..

'ఉపాధి' కల్పనపై ఎంపిడిఒలు ప్రత్యేక దృష్టి సారించాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ అమలవుతున్న నేపథ్యంలో పెన్షన్లు, పిడిఎస్ బియ్యం పంపిణీలో జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పెన్షన్ల పంపిణీ, పిడిఎస్ బియ్యం పంపిణీ, ఉపాధి హామీ పనులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ అమలు, తదితర అంశాలపై జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకూ చేపట్టనున్న పెన్షన్ల పంపిణీలో ఎన్నికల కమీషన్ సూచనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం నగదు తీసుకెళ్లే సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ (ఎంసిసి) అమలును దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, పంచాయతీ సెక్రటరీలకు ఒక ఆథరైజేషన్ లెటర్ ఇవ్వాలన్నారు. పెన్షన్ల పంపిణీలో వాలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ సొమ్ము పెన్షన్ దారునికి పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ పంపిణీ చేసే సమయంలో ఎలాంటి ఫొటోలు తీయరాదన్నారు. వీడియోలు రికార్డు చేయరాదన్నారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియలో రాజకీయ నాయకులు, ఇతర వ్యక్తుల ప్రమేయం లేకుండా చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల వద్ద ఐడి కార్డు, ఆథరైజేషన్ లెటర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఎంసిసి సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఆథరైజేషన్ లెటర్‌లో ఎంత నగదు ఉంటే అంతే నగదును వాలంటీర్లు తీసుకెళ్లాలన్నారు. అదనపు నగదు ఉండరాదని, ఎక్కువ నగదు ఉంటే దానిపై చర్యలు తీసుకుని సీజ్ చేయాలన్నారు. ఏ రకమైన ఉల్లంఘనలు ఉన్నా వారిపై ఎఫ్ఐఆర్ నమోదు అవుతుందని వివరించాలన్నారు. పంచాయతీ సెక్రటరీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలతో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించుకుని సూచనలు అందించాలన్నారు. పిడిఎస్ బియ్యం పంపిణీలో ఎంసిసి ఉల్లంఘనలు జరిగితే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల ఉల్లంఘనల కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పిడిఎస్ బియ్యం పంపిణీకి సంబంధించి ఎండిఒ ఆపరేటర్లు, డీలర్లపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, ఎక్కడైనా ఎంసిసి ఉల్లంఘనలు జరిగితే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల ఉల్లంఘనల కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయం ఆపరేటర్లు, డీలర్లకు తెలియజేయాలన్నారు. బియ్యం పంపిణీ చేసే ఎండిఒ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్లు, అసిస్టెంట్లపై ఫిర్యాదులు ఉంటే సస్పెండ్ చేయాలని, కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఉపాధి హామీ పనుల కల్పనపై ఎంపిడిఒలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం రోజుకు కూలీలకు రూ.272 వేతనం అందిస్తుండగా, ఏప్రిల్ 1వ తేదీ నుంచి రూ.28 పెంచి రూ.300 వేతనం వచ్చేలా కేంద్రం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ విషయమై కూలీలకు తెలియజేసి, ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఉరవకొండ, కూడేరు, తదితర 14 మండలాల్లో తక్కువ మంది కూలీలకు పనులు కల్పించడం జరుగుతోందని, ఎక్కువమంది కూలీలకు పనులు కల్పించడంపై మరింత పురోగతి సాధించాలన్నారు. డైలీ లేబర్ రిపోర్ట్ మరింత పెంచాలని, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అన్ని మండలాల్లోనూ ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి పనులు చేపట్టాలని, ఉపాధి పనుల కల్పనపై గ్రామాల్లో టామ్ టామ్ వేయించి కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఇబ్బంది లేకుండా అడిగిన వారికి పనులు కల్పించాలని ఆదేశించారు.జిల్లాలో తాగునీటి సమస్యకు సంబంధించి జిల్లా, పట్టణ, మండల స్థాయిలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌లకు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్న వార్డులను పరిశీలించాలని, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు రోజు రెండు పంచాయతీలు, వార్డులను పరిశీలించాలన్నారు. కంట్రోల్ రూమ్ లలో రిజిస్టర్ మైంటైన్ చేయాలని, ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ అమలుకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై ఎక్కడ రాజకీయ పార్టీల రంగులు కనిపించకుండా తొలగించాలని, కలర్ కోడింగ్ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయమై ఎఫ్.ఎస్.టీ, ఎంసిసి టీంలు పర్యవేక్షణ చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లు, పరిసర ప్రాంతాల్లో వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలు ఏవైనా ప్రజలకు కనిపిస్తుంటే తొలగించాలన్నారు. సీ-విజిల్ యాప్ ఫిర్యాదులను 100 నిమిషాలలోపు విచారణ చేసి పరిష్కరించాలని, గడువు దాటకుండా పరిష్కరించడం అత్యంత ముఖ్యమన్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డిఎస్ఒ శోభారాణి, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, డిఎల్‌డిఒలు పాల్గొన్నారు.

నాడు మిత్రులు.. నేడు ప్రత్యర్థులు..!

గమ్మనూరు రాకతో గుంతకల్లులో మారిన రాజకీయాలు

గుమ్మనూరు జయరాం

వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు నియోజకవర్గం టిడిపి అభ్యర్థిని ప్రకటిస్తూ ఆ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. వైసిపి నుంచి టిడిపిలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు టికెట్‌ను కేటాయించారు. దీంతో గుమ్మనూరు జయరాం మద్దతుదారులు సంబరాలు జరుపుకున్నారు. ఇదే సమయంలో జితేంద్రగౌడ్ మద్దతుదారుల నుంచి తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. గుమ్మనూరు రాకను ఆయన మద్దతుదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్నన్ని రోజులూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను తీవ్ర స్థాయిలో దూషించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన్ను అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారంటూ జితేంద్రగౌడ్ మద్దతుదారులు ప్రశ్నిస్తున్నారు. గుమ్మనూరు జయరాం రాకను జితేంద్ర గౌడ్ వర్గీయులు, కార్యకర్తలు, అభిమానులు వ్యతిరేకిస్తూ గత కొంత కాలంగా నియోజక వర్గంలో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. అధిష్టానం వీటిని లెక్కచేయకుండా గుమ్మనూరు జయరాంకు టికెట్ కేటాయించింది. ఈ పరిస్థితుల్లో జితేంద్ర గౌడ్ మద్దతుదారులు ఆయన విజయానికి ఏ మేరకు సమకరిస్తారన్నది వేచి చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా గతంలో ఒకే పార్టీలో ఉండి మిత్రులుగా ఉన్న గుమ్మనూరు జయరాం, వై.వెంకట్రామిరెడ్డిలో ఇప్పుడు ప్రత్యర్థులుగా మారారు. గుంతకల్లు నియోజకవర్గం నుంచి వీరు ప్రధాన పార్టీల అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. మిత్రులుగా ఉన్న వీరు ప్రత్యర్థులుగా మారి పోటీలో నిలవడంతో గుంతకల్లు రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఇద్దరిలో ఎవరు ప్రజల ఆదరాభిమానాలను పొంది విజయం సాధిస్తారన్నది రానున్న ఎన్నికల్లో తేలనుంది.

చిత్రలేఖనం ప్రతులను ప్రదర్శిస్తున్న అతిథులు

'సీమ' సాంస్కృతిక రంగంలో కొత్తమలుపు

ప్రజాశక్తి-అనంతపురం

రాయలసీమ ప్రాంత జీవన స్థితిగతులు, సంస్కృతిని కేవలం సాహిత్యంలోనే కాక రంగుల చిత్రాల్లో వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా చిత్రించడం సీమ సాంస్కృతిక రంగంలో మరో కొత్తమలుపు అని మానవతా కన్వీనర్, రచయిత తవిసెల అమరనాథరెడ్డి, సామాజిక కార్యకర్త కంబదూరు షేక్ నబీరసూల్ అన్నారు. వేమన పౌర వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షత శుక్రవారం నగరంలోని ఎస్ఎస్బిఎన్ కళాశాలలో తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారకార్థం రాయలసీమ చిత్రలేఖ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న సంప్రదాయాలు, మతాలు భిన్నత్వంలో ఏకత్వంలా రాయలసీమ సమాజం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమ కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నేపథ్యంగా వందకుపైగా చిత్రాలు రావడం, అవి ప్రదర్శన అందుకోవడం మంచి ప్రారంభమన్నారు. ఈ కార్యక్రమంలో కవులు రచయితలు నారాయణస్వామి, షేక్ రియాజుహుస్సేన్, సురేష్, మధుశ్రీ, వన్నప్ప, క్రిష్ణవేణి, పూజారి ఈరన్న, టి.వి.రెడ్డి, న్యాయవాది సత్యనారాయణరెడ్డి, వన్నూరుసాబ్, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, లోకన్న, నాగశేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి



మహిళతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

మోసం చేయడం టిడిపి అధినేత చంద్రబాబు నైజమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం నగరంలోని 22వ డివిజన్లో 'ఇంటింటికి వైసిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు అనంతపురం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి మరోసారి సిఎం జగన్ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. చంద్రబాబు నైజం అందరికీ తెలుసు అన్నారు. 40ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల సిఎంగా పని చేసి అడుగడుగునా ప్రజలను మోసం చేసిన చరిత్ర ఆయనది అన్నారు. 1996లో చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు రాయలసీమకు కృష్ణాజలాలు తీసుకొస్తానని హంద్రీనీవాకు రెండు సార్లు శంకుస్థాపన చేసి 5 టిఎంసీలకు కుదించిన నీచ చరిత్ర చంద్రబాబుది అన్నారు. రాయలసీమ సాగు నీటి ప్రాజెక్టులు, కరువు గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు, టిడిపి నేతలకు లేదన్నారు. కృష్ణాజలాలు అనంత వెంకటరెడ్డి హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా వస్తున్నాయంటే అది వైఎస్ఆర్ చలవే అన్నారు. వైఎస్ఆర్ కలలను నిజం చేస్తూ 2012లో జీడిపల్లికి నీరు తెచ్చిన చరిత్ర తమది అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామని హామీ ఇచ్చి 1, 2వ దశ పనులు పూర్తి చేసి కుప్పానికి నీరు అందించారని గుర్తు చేశారు. కృష్ణాజలాల కోసం ఏళ్ల తరబడి ఎంతో మంది పోరాటం చేసినా సార్థకత చేసింది మాత్రం వైఎస్ఆర్, ఆయన తనయుడిగా జగన్ అన్నారు. ఎన్నికల సమయంలో అబద్ధాలు చెప్పడం, ప్రజలను రెచ్చగొట్టడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. ప్రజాగళం బహిరంగ సభల్లో చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. మద్యానికి బానిసలు కాకుండా భర్తలను చైతన్యం చేయండి అని చెప్పడం మానేసి, తక్కువ ధరకే మద్యం ఇస్తా... మంచి మద్యం ఇస్తా అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి వ్యక్తికి అధికారం ఇవ్వాలా? అని ప్రశ్నించారు. ప్రజలంతా ఒకసారి ఆలోచించాలని సూచించారు. రాప్తాడు, బుక్కరాయసముద్రంలో జరిగిన సభల్లో చంద్రబాబు మాటలు వినలేక ప్రజలు వెనుదిరిగి వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమం కోసం సిఎం జగన్ కృషి చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కూడా ఆయనకే ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

దగ్గుపాటి ప్రసాద్ను అభినందిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

రాప్తాడు ఎంపిపిగా రాజకీయ ప్రస్థానం

అనతికాలంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా 'దగ్గుపాటి'

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అర్బన్ టిడిపి అభ్యర్థిగా పార్టీ అధిష్టానం అనూహ్యంగా దగ్గుబాటి ప్రసాద్ను ప్రకటించింది. ఈయన జిల్లాకేంద్రం సమీపంలోని రాప్తాడు మండలంలోని 2014లో ఎంపిపిగా పని చేశారు. ఎంపిపిగా ఉంటూనే టిడిపి అభివృద్ధి, పార్టీ క్యాడర్కు చిన్న కష్టమొచ్చినా ఆదుకున్నారు. అదేసందర్భంలో రాష్ట్ర ఎంపిపిల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. పార్టీ మీద ఆయనకు ఉన్న విధేయత, అందరినీ కలుపుకు పోయేతత్వాన్ని గుర్తించి అనంతపురం అర్బన్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించినట్లు తెలుస్తోంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభ్యర్థిగా తనను నియమించిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. దగ్గుబాటి ప్రసాద్ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ శ్రేణులు నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

టిడిపితోనే అన్నివర్గాల అభివృద్ధి

ఉరవకొండ అభ్యర్థి పయ్యావుల కేశవ్

మహిళకు నమస్కరిస్తున్న పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం ఉరవకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా పార్క్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోటప్ప కట్ట వద్ద నుంచి ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి రానున్న సార్వత్రిక ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజా సమస్యలతో పాటు అన్నివర్గాల ప్రజలకు మేలు జరగాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : త్వరలో జరిగే ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని జీడిపల్లి, వీరాంజనేయ కొట్టాలలో 'బాబు షూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం చేసిన వైఫల్యాలు గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యంగా చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంతో ప్రజలు విసుకు చెందుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున, గుండ్లపల్లి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీగా పుట్టినందుకు గర్వపడుతున్నా..

ఎంఎ, బిఇడి చేశా.. టిప్పర్ డ్రైవర్ అంటూ హేళన చేస్తారా..-వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

విలేకరులతో మాట్లాడుతున్న ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-శింగనమల

'ఎస్సీగా పుట్టినందుకు గర్వపడుతున్నా.. ఎంఎ, బిఇడి చేశా..' అయితే టిప్పర్ డ్రైవర్ అంటూ టిడిపి అధినేత చంద్రబాబు అవహేళనగా మాట్లాడటం బాధాకరమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం శింగనమల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. అదే టిడిపి అధినేత చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలంటే చులకన భావం అన్నారు. ఎందుకంటే బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో ఒక సామాన్య నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తనను హేళన చేస్తూ మాట్లాడటం ఇందుకు నిదర్శనమన్నారు. ఒక టిప్పర్ డ్రైవర్కు టికెట్ ఇచ్చారని ఎగతాళిగా మాట్లాడటం, చదువురాని వేలిముద్రకే టిక్కెట్టు ఇచ్చారా.. అంటూ హేళనగా మాట్లాడటం బాధాకరమన్నారు. తాను టిప్పర్ డ్రైవర్గా, మడకశిర అభ్యర్థి లక్కప్ప ఉపాధి కూలీగా పని చేసినందుకు గర్వపడుతున్నామన్నారు. కుటుంబం పోషించుకోవడానికి టిప్పర్ డ్రైవర్గా పని చేశాను తప్ప.. క్లబ్ల్లో డాన్స్ లేసి సంపాదించుకోలేదని ఎద్దేవా చేశారు. తమది పేదల పార్టీ కాబట్టే జగనన్న పేదలకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారన్నారు. మీది పెత్తందార్ల పార్టీ కాబట్టి కోటీశ్వరులకు టికెట్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. పేద దళిత కుటుంబంలో పుట్టి, కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చానన్నారు. ఎస్సీగా పుట్టినందుకు గర్వపడుతున్నానన్నారు. అంతేగాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశం కలుగుతున్నందుకు సంతోషపడుతున్నానన్నారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబుకు అద్భుతమైన విజన్ ఉందన్నారు. ఇకపోతే తమ ఎమ్మెల్యే వాళ్లు తనను బినామీగా పెట్టుకున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు జీవితం అంతా బినామీలతో వస్తోందని, అందుకే ఆయనకు అలవాటు అయిందన్నారు. రానున్న రోజుల్లో టిడిపికి కాలమే సమాధానం చెబుతుందన్నారు.

'విశ్వ' గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్ఛార్జి ప్రణయ్రెడ్డి

మాట్లాడుతున్న వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్ఛార్జి ప్రణయ్రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి విజయమే లక్ష్యంగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తనయుడు, వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్ఛార్జి వై.ప్రణయ్రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం విడపనకల్ మండల పరిధిలోని హావలిగి గ్రామంలో సర్పంచి గీతమ్మ ఆధ్వర్యంలో విజయసంకల్ప యాత్ర జైత్రయాత్ర చేపట్టారు. ముందుగా పాల్తూరు నుంచి హావళిగి వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హావలిగి నేతలు గజమాలతో యువనేతను సత్కరించారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రణయ్రెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోసపూరిత మాటలతో ప్రజలను మోసం చేయడానికి పయ్యావుల కేశవ్ వస్తున్నారన్నారు. ఏం చేయాలో దిక్కుతోచక ఓటమి భయంతో పయ్యావుల కేశవ్ నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారన్నారు. కేశవ్ ఎన్ని జిమ్మిక్కులు కుయుక్తులు పడినా మోసపోవద్దన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేవలం హావలిగి గ్రామంలో సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించినట్లు వివరించారు. ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మరొకసారి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు, మండల కన్వీనర్ బసన్న, జెసిఎస్ కన్వీనర్ భరత్రెడ్డి, ఎంపిటిసిలు కళావతి, రాజశేఖర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ డోనేకల్ రమేష్, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, నాయకులు కరణం భీమిరెడ్డి, దేశాయ్ సిద్ధార్థ, ఉమాశంకర్, ప్రసాద్, సురేష్యాదవ్, మడకశిర తిప్పయ్య, రామాంజనేయులు, వెంకటస్వామి, సుంకన్న, ఉలిగప్ప, యువరాజు, గిరిబాబు, ప్యాపిలి భీమా, కిష్టా, ధనుంజయ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో రైతులు నామినేషన్లు వేయండి

రైతు రక్షణ వేదిక కన్వీనర్ గౌని ప్రతాపరెడ్డి

రాయదుర్గం : సార్వత్రిక ఎన్నికల్లో లోకసభ, అసెంబ్లీ స్థానాలకు రైతులు నామినేషన్లు వేయాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక కన్వీనర్ గౌని ప్రతాపరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల్లో రైతుల తరపున అధికంగా నామినేషన్లు వేస్తే ఆయా పార్టీలు రైతులు, వ్యవసాయ రంగం ప్రాముఖ్యతను గుర్తించి రైతాంగానికి సంబంధించి వాగ్దానాలు, హామీలు ప్రకటించే అవకాశం ఉందన్నారు. తద్వారా అధికారంలోకి వచ్చాక వారు వాటిని అమలు చేసే వీలు కలుగుతుందన్నారు. తుంగభద్ర ఎగువ కాలు వ ఆధునీకరణకు గత ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసినా పనులను పూర్తి చేయడంలో విఫలం అయ్యారన్నారు. ఎగువ కాలువ దుస్థితి వల్ల నియోజకవర్గంలో లక్ష ఎకరాల ఆయకట్టు బీడుగా మారిందన్నారు. నియోజకవర్గానికి సంబంధించి ప్రధాన రాజకీయ పార్టీలు రైతాంగం రక్షణకు చేపట్టే చర్యలపై మేనిఫెస్టో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గం : ఎన్టీఆర్ టిడిపిని స్థాపించి 42 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంతి, హనుమంతు, మహబూబ్ బాషా, పురుషోత్తం, భారతి, వెంకటేశులు, శంకర్, సన్నన్న, తిప్పేస్వామి, మల్లి, అంజి, రవి, కిరణ్కుమార్ పాల్గొన్నారు.

ఎన్టిఆర్కు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

పుట్లూరు : మండలంలోని ఏ.కొండాపురం గ్రామంలో శుక్రవారం టిడిపి అవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్నాయుడు, బాలరంగయ్య, శివశంకర్రెడ్డి, భాస్కర్నాయుడు, చంద్ర, ఓబుళనాయుడు, గోవర్ధన్రాజు, శ్రీనివాసరెడ్డి, యూనిట్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థుల విజయానికి కృషి

పామిడి : తెలుగుదేశం పార్టీ గుంతకల్లు శాసనసభ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన గుమ్మనూరు జయరామ్ విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని అనంతపురం డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గుమ్మనూరు జయరామ్ను టిడిపి అధినేత నిర్ణయించడం వెనుక ఎన్నో రకాలుగా ఆలోచించి ఉంటారన్నారు. ముఖ్యంగా సామాజిక కోణాలు చూసుకుని ఉంటారన్నారు. టీడీపీ అంటేనే క్రమశిక్షణ అన్నారు. అలాంటి క్రమశిక్షణ కార్యకర్తగా పార్టీ అధినేత నిర్ణయాన్ని తాను శిరశావహిస్తానన్నారు.

చంద్రబాబును కలిసిన 'డేగల'

చంద్రబాబుకు బొకే అందజేస్తున్న కృష్ణమూర్తి

శింగనమల : నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమానికి విచ్చేసిన చంద్రబాబును టిడిపి అనంతపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు బొకే అందజేసి స్వాగతం పలికారు.

వాల్మీకుల సంబరాలు

నార్పల : వాల్మీకులకు అధిక సీట్లు కేటాయించినందుకు టిడిపి అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేష్కు మండలంలోని వాల్మీకులు కృతజ్ఞతలు చెబుతూ మండల కేంద్రంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిలమకూరి సుధాకర్, తలారి హరీష్ మాట్లాడుతూ జిల్లాలోని రాయదుర్గం, గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థులుగా మాజీమంత్రులు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరామ్, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణ, కర్నూలు జిల్లా మంత్రాలయ నియోజకవర్గ అభ్యర్థిగా రాఘవేంద్రరెడ్డి, ఆదోని బిజెపి అభ్యర్థిగా డాక్టర్ పార్థసారధులకు అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. అదేవిధంగా జిల్లాలోని వాల్మీకులందరూ ఐక్యతతో వాల్మీకి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తలారి మహేష్, చికెన్ చంద్ర, తలారి వంశీ, మధు, శ్రీనివాసులు, తలారి చంద్ర, పెద్దన్న, సుధాకర్, జగదీష్, లచ్చు, సెల్ పాయింట్ రాజు, చిన్న, భరత్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

పుట్లూరు. శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలం కుచివారిపల్లిం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి నాయకులు చిన్న నారాయణ శుక్రవారం గుండెపోటుతో మరణించడంతో టిడిపి నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

CHANGE OF NAME

We Penagalapati Keerthi and Maddipatla Mahesh Kumar parents of Maddipatla Gauravh Prathik Residing at D.No. 9-197, Gulzarpet, Anantapuram City and Dist of A.P. we have changed our Son name from Maddipatla Gowrraw Charran (old name) to **MADDIPATLA GAURAVH PRATHIK** (New name) for all purposes.

గుమ్మనూరు జయరాం అనుచరుల సంబరాలు

గుత్తిలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి శ్రేణులు

గుత్తి : మాజీమంత్రి గుమ్మనూరు జయరామ్కు గుంతకల్లు టిడిపి ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో గుత్తిలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గుమ్మనూరు జయరామ్ అనుచరులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని గాంధీ కూడలికి పెద్ద ఎత్తున చేరుకుని బాణాసంచా కాల్చారు. గుమ్మనూరు జయరామ్ను ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

పామిడి : గుమ్మనూర్ జయరామ్కు టికెట్ కేటాయించడాన్ని హర్షిస్తూ శుక్రవారం పామిడి మండల కేంద్రంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఎద్దులపల్లి సర్కిల్లో టపాసులు పేల్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUDICIAL MAGISTRATE PERIYAKULAM

S.T.C.No: 721 / 2021

M/s. Rajshree BIO Solutions LLP,
Represented by Mr.Thanga
Tirupathi Varadaraj Nagar, Periyakulam Taluk, Theni Distriet, Tamilnadu.
.....Complainant

Rajasekhar Proprietor of Sri Lakshmi Narasimha Fertilizers & Pesticides,
5/76 Kamma Vari Veedi, Peeda Chinna Pyapillai, Varrakarur, Uravakonda, Ananthapur, Andharapredesh State.
.....Accused

NOTICE

Take Notice that the complainant has filed complaint against you before the Judicial Magistrate court Periyakulam Theni District Tamilnadu and it has been numbered as STC No. 721/2021 and it has been posted on 29-04-2024 and also make arrangements either to appear in person or through your counsel on that day failing which the matter will be decided in your absence on merits.

P. Subramani, B.A., B.L.,
S. Swapna, B.A., B.L. (Hons)
Advocates
113, North Agraharam, Thenkarai
Periyakulam, Theni Dt,Tamilnadu.
Cell No 9486021151.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE, ANANTAPUR

I.P.No:36/2018

Between:
Golla Veeranna ...Petitioner
And
Saki Rajesh and others ...Respondants

Notice To R5,R7,R9,R10,R13,R14 and R16

R5:Gujjala Pothulaya D.No:19/476, Rani Nagar, Ananthapuramu,
R7:Thimmaraju @ Babu S/o Anjinappa D.No:28/5/584, 77, L.L.G.Quarters, Housing Board Colony, Ananthapuramu,
R9:Subbarayudu, Balaji Novalaties, K.P.S Complex, New Town Ananthapuramu,
R10:Viswanatha Reddy, Gulzarpeta, Near Clock Tower, Ananthapuramu,
R13:Anjineyulu D.No:16/72, Old Town, Ananthapuramu,
R14:Mohan Police Conestable, Crime Branch, Dog Suqued, Police Complex New Town, Ananthapuramu,
R16:Marusu Vasudeva S/o Narayanappa, D.No:6-2-971, Ramanagar, Ananthapuramu,

పై నెంబరు కేసులో రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం 02-04-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

K.VISWANATHA REDDY
Advocate, Anantapur,
Cell:9440351523

క్రీడలతో మానసికోల్లాసం : సిఐ

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ రాజశేఖర్రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

క్రీడలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని సిఐ ఎన్.రాజశేఖర్రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాలవగడ్డ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలో యునైటెడ్ ఛాంపియన్స్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడల వల్ల దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యమే మన సంపద అన్నారు. పోటీల్లో గెలుపు, ఓటమిలను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడా పోటీల్లో గొడవలు పడరాదని హెచ్చరించారు. ఆర్డబ్ల్యూఎస్ డిఇఇ జీవి.రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం మొదటి మ్యాచ్ అనంతపురం ఏఎస్ వి ఎలైట్ జట్టు, బళ్లారి జట్టు తలపడ్డాయి. పోటీలో బళ్లారి జట్టు విజయం సాధించింది. బళ్లారి జట్టు క్రీడాకారుడు సంజయ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అనంత గ్రామీణ బ్యాంకు మేనేజర్ వి.జగదీష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.నబిరసూల్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇఇ ఎం.మంజునాథ్, ఎడిసిఎ కార్యదర్శి మధు ఆచారి, ఆర్డీటీ కో–ఆర్డినేటర్ యుగంధర్రెడ్డి, కందుల హేమ, కార్యనిర్వాహకులు ఎ.శ్రీనివాస బాబు, రాఘవేంద్ర, ఆర్.కుమార్ (జోషి), టి.సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డిఎ కూటమికి ఎంఆర్పిఎస్ మద్దతు

మాట్లాడుతున్న ఎంఆర్పిఎస్ జిల్లా నాయకురాలు సునీత

ప్రజాశక్తి-పామిడి

ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎన్డిఎ కూటమికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఎంఆర్పిఎస్ జిల్లా మహిళా నాయకురాలు సునీత తెలిపారు. శుక్రవారం స్థానిక వీరబ్రహ్మం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ దాదాపు 35 అంశాలతో కూడిన వినతిపత్రం చంద్రబాబుకు అందించారన్నారు. ఇందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్డిఎ కూటమికి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంకరాజుకాలువ వెంకటేశు, కొట్టాల సూర్యనారాయణ, మల్లేష్, కొండాపురం మధు, దేవరపల్లి తిరుపాలు, ఎంఆర్పిఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చెక్పోస్టులో వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసులు

చెక్పోస్ట్ తనిఖీ

రాయదుర్గం : పట్టణ శివారులోని పైతోట గాలి మారెమ్మ ఆలయ సమీపంలో అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటుచేసిన చెక్పోస్ట్ను శుక్రవారం కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, రాయదుర్గం సిఐ శ్రీనివాసులు తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎట్టి పరిస్థితుల్లో అక్రమంగా నగదు, మద్యం రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పరిస్థితులపై ఎస్ఎస్టి బృం దాన్ని, కింది స్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అల్పాహారం

గుత్తి : పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఎఐటియుసి అనుబంధ సంస్థ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్ మాట్లాడుతూ ఆటో యూనియన్ అధ్యక్షుడు రామంజి ఇటీవల చలివేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని అల్పాహారం ఇవ్వడం లాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేస్తున్న దృశ్యం